# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

## సీపీఐ( మావోయిస్టు) కేంద్ర కమిటీ వెటరన్ సభ్యుడు
## కామ్రేడ్ పూర్ణేందు శేఖర్ ముఖర్జీ అమర్ రహే!

### పత్రికా ప్రకటన

**14 ఆగస్టు, 2021**

మనం కొద్ది రోజులలో జరుపుకోబోతున్న మన పార్టీ ఆవిర్భావ వారోత్సవాల ఉత్సాహభరిత రాజకీయ వాతావరణంలో అత్యంత విషాదకర వార్తను వినాల్సి వస్తోంది. ఇటీవలే మా యువ సీసీ మెంబర్ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ యాప నారాయణ అమరత్వ వార్త నుండి మనమింకా పూర్తిగా తేరుకోక ముందే మేం వెటరన్ కామ్రేడ్ అంబర్‌దాను కోల్పోయాం. సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ పూర్ణేందు శేఖర్ ముఖర్జీ (అంబర్‌దా) శనివారం 7 ఆగస్టు 2021 ఉదయం అనారోగ్యంతో దక్షిణ కొలకతాలోని బన్స్‌ద్రోని ఏరియాలో తుదిశ్వాస విడిచారు. ఆయన చాలాకాలంగా సీఓపీడీతో బాధపడుతున్నారు. నక్సల్బరీ తరానికి చెందిన ఒక వెటరన్ మావోయిస్టు విప్లవకారున్ని భారత విప్లవోద్యమం కోల్పోయింది. ఆయన మరణం మా పార్టీకి తీవ్రమైన నష్టాన్ని కలిగించింది. ఆయన దాదాపు గత 55 సంవత్సరాల విప్లవ జీవితంలో అనేక ఒడిదొడుకులను చూశాడు. విప్లవోద్యమ పురోగమనానికి అహర్నిషలు అలుపెరుగని కృషి చేసి తుదివరకూ నమ్మిన ఆశయాల కోసం పాటుపడిన విప్లవకారుడాయన. నేడు దేశం ఎదుర్కొంటున్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు పరిస్థితులలో అపార అనుభవ సుసంపన్నుడైన కామ్రేడ్ ముఖర్జీని కోల్పోవడం మా పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఆయన మా పార్టీలో కామ్రేడ్ అంబర్‌దా, గగన్‌దాగా కేడర్ల అభిమానాన్ని చూరగొన్న నాయకుడు. పశ్చిమ బంగాలో ఆయన అనేక చోట్ల వివిధ పేర్లతో ప్రజల మధ్య విప్లవ నిర్మాణానికి కృషి చేసి వారి ఆదరాభిమానాలను చూరగొన్న ప్రజా నాయకుడు. ఆ నాయకుడికి మా పార్టీ కేంద్రకమిటీ వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లర్పిస్తోంది. ఆయన నమ్మిన ఆశయాల కోసం తుదివరకూ పోరాడితీరుతుందనీ శపథం చేస్తోంది.

కామ్రేడ్ పూర్ణేందు విద్యార్థి దశలోనే వామపక్ష విద్యార్థి సంఘంలో చురుగ్గా పనిచేశాడు. ఆ తరువాత ఆయన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించినప్పటికీ వామపక్ష రాజకీయాలను అంటి పెట్టుకొనే ఉన్నాడు. 1960ల చివర దేశ యువతను తీవ్రంగా ఆలోచింపచేసిన నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటంతో ఆయన విప్లవ రాజకీయాల పక్షం చేరాడు. మొదట ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ, ఆ పిదప మార్క్సిస్టు పార్టీ అనుసరించిన రివిజనిస్టు రాజకీయాలతో తెగతెంపులు చేసుకొని 1969లో కామ్రేడ్ కన్హయ ఛటర్జీ, అమూల్యసేన్‌ల నాయకత్వంలో ఆవిర్భవించిన మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్‌తో సమైక్యమయ్యాడు. అప్పటినుండి ఆయన చివరివరకూ భారత నూతన ప్రజాతంత్ర విప్లవ పరిపూర్తికై అత్యంత అంకితభావంతో వివిధ స్థాయిలలో పనిచేశాడు. ఆయన అనేక రకాల అణచివేత చర్యలను ఎదుర్కొన్నాడు. దేశంలో ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితులలో ఆయన జైలు జీవితాన్ని అనుభవించాడు. ఆ తరువాత పార్టీ, ఉద్యమం ఎదుర్కొన్న అనేక ఆటుపోటులలో, మెలికలు మలుపులలో భాగమై ఉద్యమ పురోగమనానికి కృషి చేశాడు. ఆయన ఎన్నడూ విప్లవ రాజకీయాల నుండి మడిమ తిప్పలేదు.

1998 నుండి దాదాపు మూడేళ్ల కాలం దేశంలోని రెండు ప్రధాన విప్లవ స్రవంతులకు చెందిన పార్టీల నడుమ ఉత్పన్నమైన ఘర్షణలతో విచలితుడై మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ నుండి బయటికి వెళ్లాడు. విప్లవ క్యాంపుకు చెందిన కామ్రేడ్స్‌తో, మిత్రులతో కలిసి ఘర్షణల నివారణకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఆ సమయంలో విప్లవ కమ్యూనిస్టు సెంటర్ (ఆర్‌సీసీ) (మావోయిస్టు)ను ఏర్పర్చి భారత విప్లవోద్యమంలో తలెత్తిన అవాంఛనీయ ఘర్షణలను నివారించి వాటి మధ్య ఐక్యతను పెంపొందింపచేయడానికి సోదర కమ్యూనిస్టు పార్టీలతో కలిసి చాలా కృషి చేశాడు. తాను ఆశించిన దిశలో రెండు పార్టీల మధ్య ఐక్యతా వాతావరణం పెంపొందుతున్న తరుణంలో కామ్రేడ్ ముఖర్జీ తిరిగి యంసీసీఐలో చేరాడు. వారందరి కృషి ఫలితమే రెండు పార్టీల మధ్య చీకటి అధ్యాయం ముగిసి భారత నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమ పురోగమనానికి నూతన దారులు తెరుచుకొని రెండు పార్టీలు విలీనమై 2004 సెప్టెంబర్ 21న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. ఆ పార్టీలో కామ్రేడ్ ముఖర్జీ కేంద్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు. ఆ తర్వాత కేంద్రకమిటీ ఏర్పర్చిన తూర్పు మధ్య రీజియన్ బ్యూరోలో భాగమై ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ఉద్యమాలను సంఘటితం చేయడానికి ప్రత్యేక కృషి సలిపాడు. ఆ రెండు ప్రాంతాలకున్న పలు విశిష్టతల నేపథ్యంలో కామ్రేడ్ అంబర్‌దా కేంద్రీకరించి పని చేశాడు. ఆ బ్యూరోకు బాధ్యులుగా ఉన్న కామ్రేడ్ నారాయణ సన్యాల్ 2005లో అరెస్టయ్యాక ఇక ఆ ప్రాంత ఉద్యమ నిర్మాణంలో కామ్రేడ్ అంబర్‌దా మరింత చురుగ్గా పాల్గొన్నాడు.

కామ్రేడ్ ముఖర్జీ 2007లో జరిగిన పార్టీ ఐక్యతా కాంగ్రెస్ తొమ్మిదవ కాంగ్రెస్‌లో కేంద్రకమిటీ సభ్యుడిగా తిరిగి ఎన్నికై తుది వరకూ ఆ బాధ్యతలలోనే కొనసాగాడు. ఆయన దేశంలోని విప్లవ శక్తులను సమైక్యం చేయడానికి చాలా కృషి చేసి పలు నూతన సంబంధాలను విప్లవ నిర్మాణంలోకి తెచ్చి సంఘటితం చేశాడు. దేశంలో తీవ్రతరమవుతున్న ఫాసిస్టు నిర్బంధ పరిస్థితుల మధ్య నిలబడి పని చేయడానికి

అనేక నూతన యువ శక్తులను సమీకరించి సంఘటితం చేశాడు. పార్టీ కాంగ్రెస్ చేపట్టిన కేంద్ర కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి బీజే, డీకేలను విముక్తి ప్రాంతాలుగా మలచడానికి కార్మిక వర్గం సహ ఇతర అనేక సెక్షన్ల ప్రజల ముఖ్యంగా పట్టణ ప్రజల మద్దతును కూడగట్టడానికి ఎంతో నేర్పుతో పని చేశాడు.

కామ్రేడ్ అంబర్‌దా 2011లో ప్రమాదవశాత్తు శతృవు చేత చిక్కి 2015 చివరి వరకు దాదాపు నాలుగేళ్ల కాలం ఆయన అనేక తప్పుడు ఆరోపణలపై విచారాధీనంలోని ఖైదీగా దేశంలోని వివిధ జైళ్లలో మగ్గాల్సి వచ్చింది. ఆ తరువాత బెయిల్‌పై విడుదలయ్యాడు. జైలు జీవతం ఆయన అనారోగ్యాన్ని మరింత తీవ్రం చేసింది.  క్షీణిస్తున్న తన ఆరోగ్య పరిస్థితులను అర్థం చేసుకొని తన మరణం తదుపరి తన పార్థివ శరీరాన్ని వైద్య కళాశాలకు అప్పగించాలని భాగల్పూర్ జైలు నుండి కోరాడు. బెయిల్‌పై విడుదలైన కామ్రేడ్ అంబర్‌దా గత ఆరేళ్లుగా అనేక విప్లవ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ వచ్చాడు. నక్సల్బరీ 50 వసంతాల వేడుకలలో చాలా ఉత్సాహంగా పాల్గొన్నాడు. ఆయన సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా వేదికలో భాగమై తన కార్యకలాపాలను కొనసాగించాడు.

ప్రస్తుతం దేశ వ్యాప్త విప్లవోద్యమం వెనుకంజ స్థితిలో ఉంది. భారత విప్లవోద్యమాన్ని తుదకంటా నిర్మూలించడానికి భారత పాలక వర్గాలు పెంపర్లాడుతున్నాయి. చుట్టుముట్టి మట్టుబెట్టే దాడులను ముమ్మరం చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదులు, వారి తాబేదార్లు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక ద్రవ్య సంక్షోభ పరిస్థితుల మధ్య భారత పాలక వర్గాలు భారత విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి నడుం బిగించాయి. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సంక్షోభ భారం వారిని అనివార్యంగా విప్లవోద్యమం వైపు ఆలోచింప చేస్తుంది. ఇలాంటి పరిస్థితులలో దేశంలో ప్రత్యామ్నాయ విప్లవ శక్తిగా ఎదిగివచ్చిన మన పార్టీని ప్రజలకు వారి పోరాటాలలో నాయకత్వం వహించకుండా చేయడానికి దోపిడి పాలక వర్గాలు దేశ అంతరంగ భద్రతకు పెను ముప్పుగా మన పార్టీని ప్రకటించి మట్టుబెట్టు దాడులకు పాల్పడుతున్నాయి. దేశంలో పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే ప్రజాస్వామిక, విప్లవ శక్తులను ఎంత మాత్రం సహించకుండా వారిని కటకటాల పాలు చేస్తున్నారు లేదంటే వారి అడ్డు తొలగించుకోవడానికి తుదకు హత్యలకూ పాల్పడుతున్నాయి. దేశ ప్రజలలో భయ బీభత్స వాతావరణాన్ని కల్గించడానికి అనేక ఫాసిస్టు పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఆకాశ దాడులకు కూడ రంగం సిద్ధం చేస్తున్నారు. డ్రోన్‌లతో దాడులు సలుపుతున్నారు. ప్రహార్ 3కు పథకం రూపొందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో బలహీనమైన విప్లవ శక్తులు గుండెజారి దిగజారిపోతూ విప్లవ క్యాంపు నుండి వైదొలగుతూ శతృవు పక్షం చేరి విప్లవోద్యమంపై అవాకులు చవాకులతో చౌకబారు దాడులకు పూనుకుంటున్నారు. ఈలాంటి అనేక రకాల సవాళ్లను పార్టీ ఎదుర్కొంటున్న సమయంలో మొక్కవోని ధైర్యంతో విప్లవోద్యం పురోగమనానికై తుది వరకు పాటుపడిన కామ్రేడ్ పూర్ణేందు అమరత్వం ఎంతో లోటును మిగిల్చింది. కానీ, భారత విప్లవోద్యమం ఎంత మంది ఉత్తమ కార్మిక వర్గ పుత్రులను, పుత్రికలను, నాయకులను కోల్పోతున్నప్పటికీ అజేయమైన మావోయిజం ఆయుధంతో ప్రజాయుద్ధాన్ని పురోగమింపచేస్తూ ప్రజలలో నుండి అనేక నూతన శక్తులను సమీకరించుకుంటూ అమరవీరుల ఆశయాల పరిపూర్తికై పాటుపడుతోంది. అదే మా పార్టీ అమరులకు అందించే నిజమైన నివాళి.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**